‘ రాష్ట్ర బడ్జెట్‌పై జిల్లా ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. వైసీపీ హయాంలో అభివృద్ధిని విస్మరించడంతో.. కూటమి ప్రభుత్వం ఆ లోటును పూడుస్తుందని భావిస్తున్నారు. అభివృద్ధి-సంక్షేమం రెండింటికీ ప్రాధాన్యమిస్తామన్న హామీ మేరకు వ్యవసాయం, పారిశ్రామికం, సేవా రంగాలకు తగినన్ని నిధులు కేటాయిస్తారని, అందులో కొత్త జిల్లాకు తగిన ప్రాధాన్యం ఉంటుందని విశ్వసిస్తున్నారు. బడ్జెట్‌ను అసెంబ్లీలో శుక్రవారం ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో జిల్లా ప్రజల ఆశలు, ఆకాంక్షలపై కథనం. -పుట్టపర్తి, ఆంధ్రజ్యోతి ’

- నేడు అసెంబ్లీలో బడ్జెట్
- వ్యవసాయం, చేనేతను ఆదుకోవాలి
- పర్యాటకానికి నిధులు కేటాయించాలి
- సొంతింటి కల సాకారం కావాలి
- జిల్లాకు ప్రాధాన్యం ఇస్తారని ఆశలు



అభివృద్ధి.. సంక్షేమం



అమ్మవారుపల్లి వద్ద పారిశ్రామికవాడ

ఇవే ఆశలు.. ఆకాంక్షలు..!

వ్యవసాయం



జిల్లా ప్రజల ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడుతున్నారు. ఎక్కువగా వర్షాధార పంటలనే సాగు చేస్తున్నారు. హంద్రీనీవా కాలువ నీరు, బోరు బావులు ఉన్నచోట 42 రకాల ఉద్యానవన పంటలను సాగు చేస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక 30 వేల హెక్టార్లకు సూక్ష్మసేద్య పరికరాలను అందించారు. వ్యవసాయ, ఉద్యాన పథకాల రాయితీలను ఇంకా పెంచాల్సిన అవసరం ఉంది. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తే ఉపాధి పెరుగుతుంది. కరువు ప్రాంతాల జాబితాలో 22 మండలాలకు చోటు దక్కలేదు. జిల్లాలోని 32 మండల్లా పంటలు దెబ్బతిన్నాయి. అయినా 10 మండలాలే జాబితాలో చోటుదక్కడంతో మిగిలిన రైతులు ఆవేదన చెందుతున్నారు. వారికి న్యాయం చేయాలి. ఎరువులు, విత్తనం, బిందుసేద్య పరికరాలపై సబ్సిడీ పెంచాలి.

పర్యాటకం



చారిత్రక సంపదకు జిల్లాలో కొదువ లేదు. కళలు, భాష, సాంస్కృతిక వైభవాన్ని చాటే దశాబ్దాల నాటి శిల్ప, చిత్ర కళలు, ఆలయాలు, పర్యాటక ప్రాంతాలు చాలా ఉన్నాయి. వారసత్వ సంపద పరిరక్షణ, పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తే.. జిల్లా ప్రజలకు ఉపాధి పెరుగుతుంది. ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది.

పరిశ్రమలు రావాలి



పెనుకొండ, పాలసముద్రం, కప్పలబండ, హిందూపురం, మడకశిర రాళ్ల అనంతపురం, గొల్లాపురం, గుడిపల్లి, దాదులూరు, శెట్టిపల్లి, సడ్లపల్లి, కొటిపి, కేతిగానిచెరువు, కుటాగుళ్ల వద్ద పరిశ్రమల స్థాపనకు అనువైన 9వేల ఎకరాలకు పైగా భూములు సిద్ధంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఐదు నెలల్లోనే మడకశిరలో రూ.1430 కోట్లతో కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టం లిమిటెడ్ (కేఎస్ఎస్ఎల్) రక్షణ రంగానికి అవసరమైన ఫిరంగులు, మందుగుండు సామగ్రి పరిశ్రమ ఏర్పాటుకు భూములు కేటాయించారు. బస్సుల బాడీ తయారీలో పేరున్న ఎంఎస్ ఆజాద్ ఇండియన్ మొబిలిటీ ప్రైవేట్ లిమిటెడ్‌కు భూములు కేటాయించారు. ఇలాంటివి మరిన్ని తీసుకురావాలి.

తాగు.. సాగునీరు



కూటమి ప్రభుత్వం హంద్రీనీవా రెండో దశ కింద జీడిపల్లి రిజర్వాయర్ ప్రధాన కాలువ నుంచి పుంగనూరు ఉపకాలువ దాకా లైనింగ్ ఏర్పాటుకు రూ.1,368 కోట్లు కేటాయించి, పనులను ప్రారంభించారు. ఎగువ పెన్నార్ ప్రాజెక్టు పుట్టకనుమ, సోమరవాండ్లపల్లి జలాశయాలకు నీటి సరఫరా ఎత్తిపోతల పథకం, చిలమత్తూరు, గోరంట్ల మండలాలకు తాగుసాగు నీరు ఇచ్చే ఎత్తిపోతల, మడకశిర నియోజక వర్గంలో రాళ్లపల్లి, రత్నగిరి రిజర్వాయర్ల నిర్మాణం, ముదిగుబ్బ మండలం గుడ్డంపల్లి తండా వద్ద జిల్లేడుబండ ప్రాజెక్టు, పుట్టపర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 193 చెరువులకు నీరిచ్చే ఎత్తిపోతల పథకాలకు నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది.

ఉపాధి ఆశలు



వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగాలకు ప్రాధాన్యం ఇవ్వలేదు. నైపుణ్య శిక్షణను ఎత్తిపెట్టారు. దీంతో యువత నిరాశలో ఉండిపోయింది. కూటమి ప్రభుత్వం బ్యాంకింగ్, ఆయిల్, గ్యాస్ అండ్ ఎనర్జీతోపాటు ఇన్ఫోసిస్, విప్రో, మహింద్రా సహా 500కు పైగా సంస్థలలో నైపుణ్య శిక్షణ ఇస్తోంది. జిల్లాలోని కాలేజీలలో 8 హబ్‌లను ఏర్పాటు చేసి నైపుణ్య శిక్షణ మొదలు పెట్టారు. నైపుణ్య శిక్షణ కేంద్రాలను మరిన్ని ఏర్పాటు చేయాలి. జిల్లాలో మానవ వనరుల అభివృద్ధికి ఎక్కువ నిధులను కేటాయించాలి.

చేనేత

వ్యవసాయం తరువాత ప్రధాన జీవనోపాధి చేనేత. చిలప నూలుపై జీఎస్టీ భారాన్ని తగ్గించాలి. నకిలీలను అరికట్టి.. నాణ్యమైన చేనేత ఉత్పత్తులను కాపాడాలి. చేనేత కార్మికులను ఆదుకునేందుకు నిధులను కేటాయించాలి. ధర్మవరంలో మెగా చేనేత క్లస్టర్ ఏర్పాటుకు రూ.30 కోట్లు మంజూరు చేశారు. ఇలాంటి మరిన్ని కార్యక్రమాలతో కార్మికులను ఆదుకోవాలి.

ఇంటి స్థలాలు.. ఇళ్లు

గ్రామీణ పేదలకు మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు చొప్పున ఇంటి స్థలాలను ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలో వ్యాప్తంగా ఇప్పటికే 45 వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. త్వరగా పట్టాలు ఇచ్చి, స్థలాలను కేటాయించాలి. టిడ్కో ఇళ్ల వద్ద మౌలిక వసతుల కల్పనకు నిధులు ఇవ్వాలి.

ఆరోగ్యంపై ఆరా

- శరవేగంగా ఎన్‌సీడీ 3.0 సర్వే
- మెరుగైన సేవలే లక్ష్యం: డిప్యూటీ డీఎంహెచ్ఓ



ధర్మవరంలో ఎన్‌సీడీ సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

ధర్మవరం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య పరిస్థితి తెలుసుకునేందుకు నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ)3.0 సర్వేను ప్రభుత్వం గత నెల నుంచి చేపట్టింది. ఈ సందర్భంగా అనేక విషయాలు వెలుగుచూస్తున్నాయి. వయసుతో సంబంధం లేకుండా రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్, బ్రెయిన్‌స్ట్రోక్, గుండెపోటు తదితర రోగాల బారిన ఎక్కువ మందిపడుతున్నారు. చాలా మంది వైద్యపరీక్షలు చేయించుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తుండటం వల్ల ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారు. జిల్లాలో ఈ సర్వే శరవేగంగా సాగుతోంది.

క్యాన్సర్ స్క్రీనింగ్

చాలా మంది మహిళలు క్యాన్సర్ బారినపడుతున్న నేపథ్యంలో 3.0 ఎన్‌సీడీ సర్వేలో భాగంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలపై దృష్టిపెట్టారు. 30 ఏళ్లు దాటిన మహిళలకు క్యాన్సర్ లక్షణాలు ఉన్నాయో, లేదో తెలుసుకుంటున్నారు. నోటి, గర్భాశయ, ఇలా వివిధ రకాల క్యాన్సర్ లక్షణాలు ఉంటే గుర్తించి వివరాలు వైద్యాధికారులకు తెలియజేస్తున్నారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో నిపుణుల పర్యవేక్షణలో వ్యాధి నిర్ధారణ చేసి చికిత్సలు అందిస్తారు.

బాధితుల గుర్తింపుపై దృష్టి

సంక్రమిత, అసంక్రమిత రోగాల సర్వే ద్వారా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితిపై అధ్యయనం చేసి అంచనా వేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందు కోసం ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌సీ, వైద్యాధికారులు, ఆశా కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. రోజుకు 15 నుంచి 20 ఇళ్ల వరకు సర్వే చేస్తున్నారు. బీపీ పరీక్షా పరికరం, మధుమేహ వ్యాధిని గుర్తించడానికి గ్లూకోమీటరు, రక్తహీనతను గుర్తించేందుకు హిమోగ్లోబిన్ మీటరు, గర్భాశయ ముఖద్వారా పరీక్షలు చేయడానికి పరికరాలను అందజేశారు.

మెరుగైన సేవలే లక్ష్యం:

సెల్వియా సాల్మన్, డిప్యూటీ డీఎం హెచ్ఓ, ధర్మవరం

సర్వే పకడ్బందీగా నిర్వహించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. గతంలో ఎన్‌సీడీ 2.0 పేరుతో ఇంటింటా సర్వే నిర్వహించాం. ప్రస్తుతం ఎన్‌పీడీ 3.0 సర్వే చేపడుతున్నాం. సిబ్బంది ఇంటింటికి వెళ్లి రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ పరీక్షలు చేయడంతోపాటు ఆహారపు అలవాట్లు తదితర వాటిపై వివరాలు సేకరిస్తున్నారు.

వేగవంతంగా భూసేకరణ

- పెండింగ్ పనులు పూర్తి చేయాలి
- అధికారులతో కలెక్టర్ సమీక్ష



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్

పుట్టపర్తి టౌన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ఎన్‌హెచ్ 342, ఎన్‌హెచ్ 716-జితో పాటు వివిధ జాతీయ రహదారుల భూసేకరణకు సంబంధించిన పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జాతీయ రహదారుల నిర్మాణాల కోసం సేకరించిన భూమికి సంబంధించిన రైతులకు చెల్లించిన నష్టపరిహారం గురించి ఆరా తీశారు. ఇప్పటి వరకు జరిగిన పురోగతి, పెండింగ్ పనులపై అడిగి తెలుసుకున్నారు. బుచ్చయ్యగారిపల్లి వద్ద అదనపు భూమి సేకరణపై దృష్టి పెట్టాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డిని ఆదేశించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ, ఆర్డీఓలు వీవీఎస్ శర్మ, ఆనంద్ కుమార్, సువర్ణ, మహేష్, అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. అదే విధంగా పరిశ్రమల స్థాపన కోసం భూసేకరణ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పరిశ్రమల స్థాపన కోసం భూసేకరణ పనులు చేపడుతున్నామన్నారు. మడకశిర, ఆర్. అనంతపురం, గౌడన్‌హల్లి నందు పరిశ్రమల ఏర్పాటుకు స్థల సేకరణ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో విజయసారథి, పరిశ్రమల శాఖ జోనల్ మేనేజర్ సోనీ సహానీ తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి ఓపెన్ ఇంటర్ పరీక్షలు

కొత్తచెరువు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఓపెన్ ఇంటర్ పరీక్షలు మార్చి 3 నుంచి 15వ తేదీ నుంచి నిర్వహిస్తున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి కిష్టప్ప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు ఉంటాయని అన్నారు. హాల్‌టికెట్లను ఓపెన్ ఇంటర్ వెబ్‌సైట్ https://www.apopenschool.ap.gov.inలో విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. హాల్‌టికెట్‌పై ఏఐ సెంటర్ కోఆర్డీనేటర్‌తో సంతకం చేయించుకోవాల్సి ఉంటుందన్నారు.

జనసందోహం మధ్య కదులుతున్న రథం



వైభవంగా శివపార్వతుల రథోత్సవం

- శివనామస్మరణతో మారుమోగిన లేపాక్షి
- పురవీధుల్లో ఉత్సాహంగా ఊరేగింపు

లేపాక్షి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): శిల్ప, చిత్రకళా క్షేత్రమైన లేపాక్షిలో గురువారం శివపార్వతుల బ్రహ్మ రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా లేపాక్షి ఆలయంలో శివపార్వతులకు ప్రత్యేక పూజలు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. వేద పండితులు శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి రథం వద్దకు తీసుకొచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంలో శివపార్వతులను ఊరేగించారు. వేలాది మంది భక్తుల నడుమ శివపార్వతులు లేపాక్షి ప్రధాన వీధుల్లో ఊరేగారు. రథోత్సవాన్ని తిలకించేందుకు జిల్లాతోపాటు కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. పలువురు దాతలు భక్తులకు అన్నదానం, పానకం, మజ్జిగ, మంచినీళ్లను అందజేశారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, హిందూపురం మునిసిపల్ ఛైర్మన్ డీఈ రమేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు. హిందూపురం రూరల్ సీఐ జనార్దన్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఉపాధ్యాయుడు, జూనియర్ అసిస్టెంట్

బాహాబాహీ

- ఎంఈఓ ఎదుటే పరస్పర దాడులు
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు



జూనియర్ అసిస్టెంట్ రాజేష్



ఉపాధ్యాయుడు లక్ష్మీప్రసాద్

తనకల్లు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రాజేష్, మండ్లిపల్లి ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు లక్ష్మీప్రసాద్ పరస్పర దాడులు చేసుకున్న సంఘటన గురువారం పోలీస్ స్టేషన్‌కు చేరింది. స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద జూనియర్ అసిస్టెంట్, ఉపాధ్యాయుడు ఘర్షణ పడ్డారు. చొక్కాలు చించుకున్నారు. ఇద్దరూ ఎంఈఓ లలితమ్మ ఎదుటే పరస్పరం దాడులు చేసుకున్నారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. జూనియర్ అసిస్టెంట్ రాజేష్ మాట్లాడుతూ.. తాను నిజాయితీగా పనిచేస్తున్నానని పేర్కొన్నారు. లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ.. తాను రాష్ట్ర ఉపాధ్యాయ సంఘంలో జిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్నానని రాజేష్‌ను ఫోనులో సంప్రదించగా తీవ్రంగా దుర్భాషలాడినట్లు తెలిపారు. ఇద్దరిని రాజీ చేసేందుకు ఎంపీడీఓ రెడ్డెప్ప ప్రయత్నించారు. ఈ విషయంపై పోలీసులను వివరణగా కోరగా.. జూనియర్ అసిస్టెంట్, ఉపాధ్యాయుడు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారని వివరించారు.

ముగిసిన అఖండ భజన

- ఘనంగా శివరాత్రి వేడుకలు

పుట్టపర్తి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా చేపట్టిన అఖండ భజన గురువారం ఉదయం 6 గంటలకు ముగిసింది. ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంతులో అఖండ భజనలో పాల్గొన్న భక్తులందరికి నారాయణసేవ అందించారు. శివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి 6 గంటలకు ప్రారంభమైన అఖండ భజన గురువారం ఉదయం 6 గంటలకు ముగిసింది. అతిరుద్ర మహాయజ్ఞం ముగిసిన అనంతరం శివరాత్రి వేడుకల్లో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



శివుడికి అభిషేకం చేస్తున్న పండితులు

న్యూస్ బాక్స్

సరిహద్దుకు చేరిన తుంగభద్ర జలాలు



మైలాపురం వద్ద కాలువలో ప్రవహిస్తున్న తుంగభద్ర జలాలు

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాలు ఈ ఏడాది రెండోసారి జిల్లాకు చేరాయి. తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి విడుదల చేసిన నీరు గురువారం జిల్లా సరిహద్దుకు చేరింది. కర్ణాటక దాటుకుని బొమ్మనహాళ్ సరిహద్దులోని 105 కి.మీ. వద్దకు తెల్లవారుజామున తుంగభద్ర జలాలు చేరుకున్నాయి. గుంతకల్లు బ్రాంచి కెనాల్ (జీబీసీ) ఆయకట్టులో పంటల పరిరక్షణకు మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు చొరవ చూపారు. వారి ప్రయత్నంతో కేసీ కెనాల్ వాటా నీరు 0.5 టీఎంసీని హెచ్చెల్సీకి మంగళవారం సాయంత్రం విడుదల చేశారు. ఆ నీరు జిల్లా సరిహద్దుకు చేరుకోవడంతో కాలువలో ముళ్ల కంపలు అడ్డులేకుండా హెచ్చెల్సీ సిబ్బంది తొలగించారు. సాయంత్రానికి సరిహద్దులో 600 క్యూసెక్కులు వస్తున్నట్లు హెచ్చెల్సీ జేఈ అల్తాఫ్ తెలిపారు. గురువారం సాయంత్రానికి మైలాపురం గ్రామ సమీపంలోని 124 కి.మీ. వద్ద తుంగభద్ర జలాల ఉధృతి పెరిగింది.

విశాఖ ఉక్కుపై 14న ఆందోళనలు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వచ్చేనెల 14న ఆందోళనలు చేపట్టనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ తెలిపారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. 32 మంది బలిదానాలతో విశాఖ ఉక్కు కర్మాగారం ఏర్పాటైందని అన్నారు. రూ.2 లక్షల కోట్ల విలువైన ఆస్తిని తగలబెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఉక్కు ఫ్యాక్టరీకి నామమాత్రంగా బడ్జెట్ కేటాయించడం చూస్తుంటే.. ప్రైవేటీకరణ ప్రయత్నాలు విరమించుకోవడం లేదన్నది స్పష్టమవుతోందని అన్నారు. దీనికి నిరసనగా వచ్చేనెల 14న వామపక్షాలు ఆందోళనలు చేపట్టనున్నాయని తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా సహాయకార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున పాల్గొన్నారు.

నేడు రాయదుర్గంలో డీఐఈపీసీ సమావేశం

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిశ్రమల ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని శుక్రవారం రాయదుర్గం పట్టణంలోని టెక్స్‌టైల్ పార్కులో నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్ తెలిపారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతినెలా నాలుగో శుక్రవారం కలెక్టరేట్‌లో సమావేశం ఉంటుందని, కానీ ఈనెల రాయదుర్గంలో నిర్వహించాలని కలెక్టర్ నిర్ణయించారన్నారు.

9 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

కదిరి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 9 నుంచి 23 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వెండిదండి శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. ఏర్పాట్లపై మార్చి ఒకటో తేదీన ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో దేవస్థానంలో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): గుత్తి మండలం గొల్లలదొడ్డి (సేవాఘడ్)లోని గిరిజన గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి, ఎస్టీ బ్యాక్‌లాగ్ 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి రామాంజనేయులు గురువారం ప్రకటనలో కోరారు. వెబ్‌సైట్ ద్వారా మార్చి 25వ తేదీలోపు దరఖాస్తు సమర్పించాలన్నారు. ఏప్రిల్ 6న విద్యార్థులకు గొల్లలదొడ్డిలోని పాఠశాలలో రాతపరీక్ష ఉంటుందన్నారు. ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారన్నారు. వివరాలకు గొల్లలదొడ్డి పాఠశాల ప్రిన్సిపాల్ 9885369079, 8978239363, 9550655840 నంబర్లలో సంప్రదించాలని ఆయన వివరించారు.

నేడు ఉమర్ అలీషా జయంతి వేడుకలు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పిఠాపురం విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం గురుపరంపర 6వ పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా 140వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం లలితకళాపరిషత్‌లో రాష్ట్రస్థాయి వేడుకలు నిర్వహిస్తున్నామని ఉమర్ అలీషా సాహితీ సమితి జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజుద్దీన్ గురువారం తెలిపారు. వేడుకలకు పీఠం 9వ పీఠాధిపతి ఉమర్ అలీషా విశిష్ట అతిథిగా హాజరవుతారని, 'భారతదేశం-మతసామరస్యం' అనే అంశంపై ప్రసంగిస్తారని తెలిపారు.

టమోటా కిలో రూ. 10

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.10తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. సరాసరి ధర రూ.8, కనిష్ఠ ధర రూ.6 పలికినట్లు ఆయన తెలిపారు.

ఏపీ సీడ్స్ ఆస్తుల తాకట్టు..!

- దివాలా దిశగా విత్తనాభివృద్ధి సంస్థ
- వైసీపీ హయాంలో సబ్సిడీ సొమ్ము ఎగనామం
- ఇప్పటి దాకా రూ.564 కోట్లకు పైగా బకాయిలు
- ఖరీఫ్‌లో విత్తన సరఫరాపై నీలినీడలు

ప్రతి ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులకు సబ్సిడీతో విత్తనాలు పంపిణీ చేసే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ (ఏపీ సీడ్స్) ఆస్తులను వైసీపీ పాలకులు తాకట్టు పెట్టారు. సంస్థకు చెల్లించాల్సిన సబ్సిడీ సొమ్ము జమ చేయకపోగా.. అనంతపురంలోని ఐదెకరాలతో పాటు రాష్ట్రంలోని వేర్వేరు చోట్ల ఉన్న ఆస్తులను విజయవాడలోని పలు బ్యాంకుల్లో తాకట్టు పెట్టినట్లు సమాచారం. గత పాలకులు చేసిన నిర్వాకంతో ప్రతి నెలా ఏపీసీడ్స్ బ్యాంకులకు వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. వచ్చే ఖరీఫ్‌లో విత్తన సరఫరాపై దీని ప్రభావం పడుతోంది.

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రతి ఏడాది సబ్సిడీ విత్తనాలు సరఫరా చేసే ఏపీసీడ్స్ (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ) దివాలా బాటలో పయనిస్తోంది. దాని ఆస్తులను ఇప్పటికే గత పాలకులు తనఖా పెట్టేశారు. ప్రతి ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో ఉమ్మడి అనంత జిల్లా రైతులకు ఏపీ సీడ్స్ సంస్థ ద్వారా విత్తన వేరుశనగ, అంతర పంటల విత్తనాలు, పప్పుశనగ విత్తనాలను సబ్సిడీతో సరఫరా చేస్తున్నారు. విత్తన పంపిణీ తర్వాత ఆ సంస్థకు సబ్సిడీ సొమ్మును ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. కొన్నేళ్లుగా ప్రతి ఏడాది ఈ ప్రక్రియ సజావుగానే సాగుతూ వచ్చింది. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అందుకు విరుద్ధంగా వ్యవహారం నడిచింది. గత పాలకులు చేసిన పాపం.. ఏపీసీడ్స్ సంస్థ పాలిట శాపంగా మారింది. గత ప్రభుత్వం ఆ సంస్థకు రావాల్సిన సబ్సిడీ డబ్బులను చెల్లించకపోవడంతో నేడు దివాలాతీసే పరిస్థితికి చేరుకుంది. బకాయి డబ్బులు చెల్లిస్తే తప్పా వచ్చే ఖరీఫ్‌లో వేరుశనగ, ఇతర విత్తనాలు సరఫరా చేసే పరిస్థితి లేదని సమాచారం.



అనంతపురంలోని ఏపీ సీడ్స్ కార్యాలయం

వైసీపీ హయాంలో సబ్సిడీ సొమ్ము ఎగనామం

వైసీపీ పాలనలో ఉమ్మడి అనంత జిల్లాలోని రైతులకు ప్రతి ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ, అంతర పంటల విత్తనాలు, ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను సబ్సిడీతో ఏపీసీడ్స్ పంపిణీ చేసింది. గత ఐదేళ్లల్లో రూ.470 కోట్లకుపైగా సబ్సిడీ సొమ్ము ప్రభుత్వం నుంచి రావాల్సి ఉన్నట్లు సమాచారం.

బ్యాంకులో ఆస్తుల తనాఖా

మొత్తం కలిపి అనంత ఏపీసీడ్స్‌కు ఇప్పటి దాకా రూ.564 కోట్లకుపైగా సబ్సిడీ సొమ్ము పెండింగ్‌లో ఉంది. వైసీపీ హయాంలో రూ.470 కోట్లకు పైగా బకాయిలు ఉండగా.. 2024-25 సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి మరో రూ.94.30 కోట్లతో కలిసి రూ.564 కోట్లకుపైగా బకాయిలు పేరుకుపోయాయి. గత వైసీపీ సర్కార్‌లో రాష్ట్ర వ్యాప్తంగా రూ.1312 కోట్లకుపైగా సబ్సిడీ సొమ్ము ప్రభుత్వం నుంచి రావాల్సి ఉన్నట్లు సమాచారం. ఏపీసీడ్స్‌కు సబ్సిడీ సొమ్మును వైసీపీ పాలకులు చెల్లించకపోవడంతోపాటు.. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని ఆ సంస్థ ఆస్తులను విజయవాడలోని పలు బ్యాంకుల్లో తనాఖా పెట్టినట్లు సమాచారం. అనంతపురం జిల్లా కేంద్రం సమీపంలోని చిన్మయనగర్ వద్ద ఐదు ఎకరాల్లో ఏపీసీడ్స్ కార్యాలయంతోపాటు గోదాములు ఉన్నాయి. ఇతర జిల్లాల ఆస్తులతోపాటు అనంతలోని ఐదెకరాల ఆ సంస్థ ఆస్తిని గత ప్రభుత్వ హయాంలో బ్యాంకులో తనఖా పెట్టారు. గత వైసీపీ సర్కార్ చేసిన నిర్వాకంతో ప్రతి నెలా ఏపీసీడ్స్ బ్యాంకులకు వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. ఏపీసీడ్స్‌కు చెల్లించాల్సిన బకాయిలను కూటమి ప్రభుత్వం తక్షణమే చెల్లించేలా ప్రత్యేక చొరవ చూపాలని ఆ సంస్థ ఉద్యోగులు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

బకాయిలు పెట్టడం దారుణం



కరువు జిల్లా రైతులకు ప్రతి ఏటా సబ్సిడీతో విత్తన వేరుశనగ, అంతర పంటలు, ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు, పప్పుశనగ ఏపీసీడ్స్ పంపిణీ చేస్తోంది. అలాంటి సంస్థకు వైసీపీ సర్కార్ కోట్లాది రూపాయలు సబ్సిడీ సొమ్మును చెల్లించకుండా బకాయిలు పెట్టడంతోపాటు బ్యాంకులో ఆస్తులు తనాఖా పెట్టడం దారుణం. ఏపీసీడ్స్ సంస్థను నిర్వీర్యం చేయడం దుర్మార్గం. కూటమి ప్రభుత్వం తక్షణమే బకాయిలు చెల్లించి రైతులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలి.

-చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ రైతు సంఘం

ప్రభుత్వమే వడ్డీ చెల్లించాలి



రైతులకు సబ్సిడీతో విత్తనాలు అందించే ఏపీసీడ్స్ సంస్థకు వైసీపీ సర్కార్ బకాయిలు పెట్టడం అన్యాయం. గత ప్రభుత్వ నిర్ణయాలతో సంస్థ దివాలా స్థాయికి చేరింది. వైసీపీ హయాంలో కోట్లాది రూపాయలు సబ్సిడీ సొమ్ము బకాయిలు ఉండడం, సంస్థ నిర్వహణ భారం కావడంతో ఆస్తులను బ్యాంకుల్లో తనాఖా పెట్టారు. గత పాలకుల నిర్వాకం తో బ్యాంకులకు ప్రతినెలా ఏపీసీడ్స్ సంస్థ వడ్డీ చెల్లిస్తోంది. ఆ వడ్డీని ప్రభుత్వమే చెల్లించాలి. పెండింగ్ బకాయిలను తక్షణమే సంస్థకు జమ చేయాలి.

-మల్లికార్జున, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురి మృతి

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో బుధవారం రాత్రి, గురువారం వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మృతిచెందగా.. పలువురు గాయపడ్డారు. శివరాత్రి ఉత్సవాలకు వెళుతూ ఇద్దరు యువకులు, వెళ్లి వస్తూ మరో యువకుడు మృతి చెందారు. పండుగ పూట ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.



రామ్‌చరణ్ (ఫైల్)



తిరుమలేష్ (ఫైల్)

పావగడ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): శివరాత్రి ఉత్సవాల కోసం బుల్లితెర నటులు వస్తున్నారని తెలిసి రొద్దం మండలం రెడ్డిపల్లికి చెందిన ఆరుగురు యువకులు రెండు ద్విచక్రవాహనాలలో వెళ్తుండగా.. ఓ ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొన్న సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో రామ్‌చరణ్ (18), తిరుమలేష్ (20) అనే యువకులు మృతిచెందగా భరత్ అనే యువకుడు తీవ్రగాయాల పాలై చికిత్స పొందుతున్నాడు. రెడ్డిపల్లికి చెందిన రామ్‌చరణ్ మడకశిరలోని రామక్రిష్ణ పాలిటెక్నిక్ కళాశాలలో ఐటీఐ రెండో సంవత్సరం చదువుతున్నాడు. తిరుమలేష్ పెనుకొండలోని కియా పరిశ్రమలో పనిచేస్తుండేవాడు. భరత్ అనే యువకుడు హిందూపురం సేవామందిరంలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రామ్‌చరణ్, తిరుమలేష్, భరత్ అనే యువకులు ఓ వాహనంలో అజయ్, ప్రశాంత్, నవీన్ మరో ద్విచక్రవాహనంలో పావగడ తాలూకా దొమ్మితిమర్రి మీదుగా లేపాక్షి ఉత్సవాల కోసం వెళ్తున్నారు. రామ్‌చరణ్ నడుపుతున్న ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో రామ్‌చరణ్ అక్కడికక్కడే మృతిచెందగా తీవ్రంగా గాయపడిన తిరుమలేష్, భరత్‌ను పావగడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హిందూపురం తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ తిరుమలేష్ మృతిచెందాడు. భరత్ చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు.

మంత్రి సవిత సంతాపం

పెనుకొండ రూరల్: కర్ణాటకలోని దొమ్మితిమర్రి సమీపంలో బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రొద్దం మండలం రెడ్డిపల్లికి చెందిన రామ్‌చరణ్, తిరుమలేష్‌అనే యువకులు మృతి చెందడంపై బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఫోన్‌చేసి సంతాపం తెలిపారు. తీవ్రంగా గాయపడిన భరత్‌కు మెరుగైన వైద్యం అందించాలని హిందూపురంలోని ఏఆర్ ఆసుపత్రి వైద్యులకు సూచించినట్లు పేర్కొన్నారు.

బస్సు ఢీకొని యువకుడు..



విజయ్ (ఫైల్)

తనకల్లు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చీకటిమానుపల్లి వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంలో కుటాగుళ్ల గ్రామానికి చెందిన విజయ్(25) అక్కడికక్కడే మృతి చెందగా, చైతన్య అనే మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కుటాగుళ్లకు చెందిన విజయ్, చైతన్య బెంగళూరులోని గ్యాస్ గోడౌన్‌లో పనిచేస్తున్నారు. శివరాత్రి సందర్భంగా అన్నమయ్య జిల్లా కంబలపల్లి వద్దనున్న మల్లయ్యకొండకు దైవదర్శనానికి వెళ్లారు. ద్విచక్రవాహనంలో స్వగ్రామమైన కుటాగుళ్లకు వస్తుండగా తనకల్లు మండలం చీకటిమానుపల్లి వద్ద బళ్లారి నుంచి తిరుపతికి వెళ్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో విజయ్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రగాయాలపాలైన చైతన్యను మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ నాగసుబ్బయ్య తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని మరొకరు..

పెద్దవడుగూరు : మండలంలోని తెలికి గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో గుంతకల్లు మండలం పూలగుట్టపల్లితండాకు చెందిన స్వామినాయక్ (38) అనేవ్యక్తి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్వామినాయక్ స్వగ్రామం నుంచి యాడికి మండలం పుప్పాలతండా వెళ్లే క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ వేగంగా ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య మంగమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి కోసం వెళ్లి మహిళా కూలీ..



అనురాధ (ఫైల్)

ఓబుళదేవరచెరువు: పొట్టకూటి కోసం ఉపాధికి వెళ్లిన మహిళా కూలీ అనురాధ(45) ఊపిరాగింది. భర్త కళ్లెదుటే రాతికప్పులు మీదపడి మృతిచెందిన సంఘటన గురువారం మండలంలోని ఇనగలూరువద్ద చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. చౌడంపల్లికి చెందిన బండి వెంకటేశ్ అతడి భార్య అనురాధ పొట్టకూటి కోసం ఏడాది క్రితం ఓబుళదేవరచెరువుకు వలస వచ్చారు. ఇనగలూరు బస్టాప్ వద్ద కోళ్లఫారం నిర్వహిస్తున్న నరసింహులుకు కల్వర్టు పని కోసం వెళ్లారు. మధ్యాహ్నం వరకు పనులుచేసి భోజనం కోసం వెళ్లారు. వాటర్‌బాటిల్ మరిచిన అనురాధ తీసుకురావడానికి కల్వర్టు వద్దకు వెళ్లింది. అదే సమయంలో ఉన్నపళంగా కల్వర్టుపైన కప్పిన రాతికప్పు ఆమె మీదపడి అక్కడికక్కడే మృతిచెందింది. అదిచూసిన భర్త గట్టిగా కేకలు వేయడంతో కోళ్లఫారం యజమానితోపాటు చుట్టుపక్కలవారు చేరుకున్నారు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డికి సమాచారం అందించారు. ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని ఎక్స్‌కవేటర్ ద్వారా ఆమెపై పడిన కప్పును తొలగించారు. అప్పటికే ఆమె ప్రాణం పోయినట్లు గుర్తించారు. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మృతదేహంతో రాస్తారోకో..

మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవడంతోపాటు అందుకు కారకులైన కోళ్లఫాం యజమానిపై చర్యలు తీసుకోవాలంటూ మృతురాలి బంధువులు, వడ్డెర సంఘం నాయకులు శవంతో రాస్తారోకో నిర్వహించారు. గంటన్నరపాటు కదిరి-హిందూపురం ప్రధాన రహదారిపై రాకపోకలు స్తంభించాయి. ఈ సందర్భంగా వడ్డెర సంఘం నాయకులు వల్లెపు సోమశేఖర్, జరిపిటి అంజినప్ప, పీట్ల సుధాకర్, ఎంపీటీసీ శ్రీనివాసులు, శంకర, తదితరులు మాట్లాడుతూ.. మృతికి కారణమైన వారిపై వెంటనే చర్యలు తీసుకుని, ఆ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలంటూ డిమాండ్ చేశారు. ఎస్ఐ జోక్యం చేసుకుని సర్దిచెప్పారు. బాధిత కుటుంబానికి పరిహారం చెల్లిస్తామని కోళ్లఫాం యజమాని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనురాధ మృతిపట్ల ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

మతిస్థిమితంలేని యువకుడు..

హిందూపురం : గోరంట్ల మండలంలోని జాతీయ రహదారిపై వడిగేపల్లి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని 30 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని యువకుడు బుధవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పాలసముద్రం కూడలిలో వారం రోజులుగా మతిస్థిమితం లేని వ్యక్తి యాచించుకుని తిరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు. బెంగళూరు రహదారిపై కొడిగేపల్లి క్రాస్ వద్ద అనంతపురం వైపు వెళ్లే గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గోరంట్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వాహనం ఢీకొని ప్రైవేట్ టీచర్..

అనంతపురం క్రైం: రోడ్డు ప్రమాదంలో ఓ ప్రైవేట్ టీచర్ మృతి చెందారు. రైల్వే శాఖలో పనిచేస్తున్న తారా మనోహర్(61) వీఆర్ఎస్ ఇచ్చి ఓ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నారు. బుధవారం రాత్రి తపోవనం నుంచి రామ్‌నగర్‌కు బైక్‌లో వెళ్తుండగా ఎస్‌మాక్స్ థియేటర్ సమీపంలో టాటా ఏసీ ఢీకొంది. దీంతో తీవ్రగాయాలైన తారా మనోహర్ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామును మృతి చెందారు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గొలుసు దొంగల బరితెగింపు

బైక్‌పై నుంచి పడి దంపతులు, చిన్నారికి గాయాలు

కనగానపల్లి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిళ్లపల్లి సమీపంలో ముసుగు ధరించిన దుండగులు గురువారం గొలుసు అపహరణకు యత్నించారు. ధర్మవరం నుంచి ద్విచక్రవాహనంలో నారాయణస్వామి, ఆమని దంపతులు చిన్నారితో కలిసి మామిళ్లపల్లి వైపునకు వస్తున్నారు. ఈక్రమంలో మామిళ్లపల్లి సమీపంలో ముసుగు ధరించిన ఇద్దరు దుండగులు ఎదురుగా వచ్చి ద్విచక్రవాహనంలో ఉన్న మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కునేందుకు ప్రయత్నించారు. గొలుసు తెగకపోవడంతో వాహనదారులు కిందపడ్డారు. అటువైపుగా వస్తున్న వాహనదారులను చూసిన దుండగులు పారిపోయారు. ద్విచక్రవాహనం నుంచి కిందపడిన నారాయణస్వామి, ఆమని, చిన్నారి గాయపడ్డారు. వారిని ధర్మవరం ఆస్పత్రికి తరలించారు. కనగానపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.





వరిలో జింక్, పొటాషియం లోపం

- పంటను పరిశీలించి.. సూచనలు ఇచ్చిన శాస్త్రవేత్తలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నంబులపూలకుంట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): జింక్, పొటాషియం లోపం వల్లే వరి పంట తెగుళ్ల బారిన పడిందని కదిరి ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ రామసుబ్బయ్య, శాస్త్రవేత్త డాక్టర్ రమేష్‌నాయక్ తెలిపారు. ఆంధ్రజ్యోతిలో 'వదలని పీడ..!' శీర్షికన ప్రచురితమైన కథనంపై స్పందించిన శాస్త్రవేత్తలు గురువారం వంకమద్ది ఆయకట్టు చెరువు కింద సాగుచేసిన వరిపంటను పరిశీలించారు. వరిపంటకు జింక్, పొటాషియం లోపం ఉందని, దీనిని నివారించకపోతే పంట ఎదుగుదల ఉండదని అన్నారు. పొటాషియం లోపం నివారణకు ఐదు గ్రాముల పొటాషియం నైట్రేట్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. జింక్‌లోపం నివారణకు జింక్ సల్ఫేడ్ 2గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. పిలకదశలో ఉన్న సమయంలో ఎకరాకు 50 కిలోల యూరియా వాడాలన్నారు. వెన్నుదశలో 50 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్ వినియోగించాలన్నారు. కాండం తొలుచు పురుగు, ఆకుముడత నివారణకు కోరాజిన్ 0.3ఎంఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. వ్యవసాయాధికారి లోకేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

దర్జా కోల్పోయిన దర్జీ



విస్తరిస్తున్న రెడీమేడ్ రంగం
ప్రభుత్వ ప్రోత్సాహకాలు కరువు
నేడు ప్రపంచ టైలర్స్ డే

కదిరి అర్బన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): దర్జీల బతుకుల్లో దర్జా కరువైంది. ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన టైలర్ వృత్తి.. రెడీమేడ్ దుస్తుల రాకతో క్రమేణా మసకబారుతోంది. దర్జీల బతుకుల్లో రెడీమేడ్ రాకతో ఉపాధి కరువైంది. శుభకార్యాలు ఉన్నాయంటే నాటి రోజుల్లో వారం, పది రోజుల ముందు దుస్తులు కుట్టించుకోవాలనుకునే వారు. సంక్రాంతి, ఉగాది, దసర, రంజాన్, క్రిస్మస్ పండగ ఏదైనా టైలర్లకు చేతినిండా పని ఉండేది. వారిని గ్రామాలలో గౌరవంగా చూడడంతో పాటు, రైతులు తాము సాగు చేసిన పంట దిగుబడులను ప్రేమతో అందించేవారు. ఇదంతా గతం.. నేడు వారి బతుకులు ముందుకు సాగడం లేదు. తగినంత పని దొరక్క, ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను వెతుక్కోవాల్సిన దుస్థితిలో ఉన్నారు. మరికొందరు గత్యంతరం లేని పరిస్థితుల్లో పనిదొరికనా, దొరక్కపోయినా ఇదే వృత్తిలో కొనసాగుతున్నారు.

● రెడీమేడ్ రంగం విస్తరించడంతో...

నేడు అన్ని వయస్సుల వారికి రెడీమేడ్ దుస్తులు అందుబాటులోకి వచ్చాయి. ఫ్యాషన్ రంగం విస్తరించింది. టీషర్ట్‌లు, జీన్స్‌ప్యాంట్స్, షార్ట్‌లు, రకరకాల దుస్తులు మార్కెట్‌లోకి వచ్చాయి. యువత ఆసక్తిని ఆదాయవనరులుగా మార్చుకొనేందుకు పెద్దపెద్ద బ్రాండెడ్ కంపెనీలు నగరాలతో పాటు చిన్న చిన్న పట్టణాలలో సైతం ఇబ్బడి ముబ్బడిగా దుకాణాలు వెలిశాయి. దీంతో సామాన్యుడు సైతం ఫ్యాషన్ పట్ల ఆకర్షితులైన రెడీమేడ్ వైపు మక్కువ చూపుతున్నారు. దీంతో టైలరింగ్ షాప్‌ల మెట్లు ఎక్కేవారు క్రమేణా తగ్గిపోతున్నారు. దీంతో ఆరునెలలు పని ఉంటే మరో ఆరు నెలలు పనిలేక ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి ఉందని టైలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు టైలరింగ్ మెటీరియల్ ధరలు పెరుగుదలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఈ కారణంగా కుట్టుకూలీ ఎక్కువ చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. టైలరింగ్ షాప్‌లు కూడా వ్యాపార సంస్థల కింద పరిగణించి విద్యుత్తు చార్జీలు వసూలు చేస్తున్నారు. ఇక షాప్ అద్దెలు, ఇస్త్రీ తదితర వాటికి పోను మిగిలింది కూలీ గిట్టుబాటే. ఒక డ్రస్ కుట్టుడానికి అయ్యే ధరలోనే రెడీమేడ్ దుస్తులు లభిస్తుండడంతో వాటినే చాలామంది కొనుగోలు చేస్తున్నారు. దీంతో దర్జీలకు ఉపాధి బాగా తగ్గిపోయింది.

● చరిత్ర ఇదీ..

కుట్టు మిషన్ లేని రోజుల్లో షర్ట్, ఫ్యాంట్లను కాస్తా అటు ఇటుగా చేతితోనే కుట్టేవారు. జర్మనీకి చెందిన విలియమ్స్ హోలే తన భార్య దుస్తులు కుట్టేందుకు అవస్థలు చూసి సుమారు 11 నెలల పాటు కష్టపడి 1846లో ఫిబ్రవరి 28న కుట్టు మిషన్‌ను కనిపెట్టాడు. అప్పటి నుంచి కుట్టుమిషన్‌లు వినియోగంలోకి వచ్చాయి. అందువలనే ఫిబ్రవరి 28న ప్రపంచ టైలర్స్ డేను జరుపుకుంటారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



టైలరింగ్ వృత్తిని నమ్ముకుని జీవిస్తున్నాం రెడీమేడ్ దుస్తుల వల్ల మాకు సరైన ఉపాధి లభించడం లేదు. దర్జీ వృత్తిని నమ్ముకున్న వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. సబ్సిడీపై రుణాలు అందించి దర్జీ వృత్తిని ప్రోత్సహించాలి.

-రామకృష్ణ, టైలర్, కదిరి

చేతినిండా పని లేదు



గతంలో రోజుకు రెండు మూడు జతలు కుట్టివాళ్లం. సీజన్‌లు ఐయితే తిందామనుకున్న తీరిక ఉండేది కాదు. గిరాకీని వెనక్కి పంపేవాళ్లం. ఇప్పుడు రోజుకు ఒక డ్రస్ కూడా రావడం లేదు. పాత దుస్తులకు చిరిగిన చోట్ల కుట్ల వేస్తూ, జిప్‌లు వేస్తూ ఉపాధి పొందుతున్నాం.

-బషీర్, టైలర్, కదిరి

రెడీమేడ్ ప్రభావం



30 యేళ్ల నుంచి టైలర్‌గా పని చేస్తున్నాను. గతంలో మాకు గిరాకీ బాగుండేది. ఇప్పుడు విద్యార్థులు, యువకులు రెడీమేడ్ వైపు ఆసక్తి చూపుతున్నారు. పాఠశాల యూనిఫాం కూడా రెడీమేడ్ వస్తోంది. పెద్దలు తప్ప మిగతావాళ్లు టైలర్‌షాప్‌ల వైపు రావడం లేదు.

-బాలరాజు, టైలర్, కదిరి

పండుగలు వచ్చినా...



దశాబ్దాలుగా ఈ వృతిలోనే ఉన్నాను. గతంలో పండుగలు వచ్చాయంటే మాకు తీరిక దొరికేది కాదు. పండుగలకు నెల ముందు నుండే సీజన్ ప్రారంభమయ్యేది. దస్తులు కుట్టించుకోవడానికి ప్రజలు వరసకట్టేవారు. రెయింబగళ్లు పనిచేసేవాళ్లం. ఇప్పుడు పండగ వచ్చినా.. పనులు ఉండటం లేదు. ప్రభుత్వం ప్రొత్సహించి ఆదుకోవాలి.

- గంగాధర్, టైలర్, కదిరి

న్యూస్ బాక్స్

నేడు కౌన్సిల్ సమావేశం

ధర్మవరం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశపు భవనంలో శుక్రవారం కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ప్రమోద్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశం ఉదయం 11గంటలకు జరుగుతుందని, ఈ సమావేశానికి కౌన్సెలర్లు, కో-ఆప్షన్ మెంబర్లు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని అన్నారు.

అర్బన్ హెల్త్‌సెంటర్ల తనిఖీ

ధర్మవరం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్లను జిల్లా వైద్యాధికారి ఫైరోజ్‌బేగం గురువారం తనిఖీ చేశారు. కొత్తపేట, సాయినగర్, దుర్గానగర్, శివానగర్, గాంధీనగర్ అర్బన్ హెల్త్‌సెంటర్లను తనిఖీ చేసి.. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎన్‌సీడీ 3.0 సర్వేపై ఆరాతీశారు. ఆమె వెంట డిప్యూటి డీఎంహెచ్ఓ సెల్వియా సాల్మాన్, వైద్యసిబ్బంది ఉన్నారు.

నేడు సీపీఐ ధర్నా

ధర్మవరం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ధర్నాలో ఇళ్లు లేని పేదలు, సీపీఐ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ముగిసిన తిమ్మమ్మ ఉత్సవాలు



బాలవీరయ్య, తిమ్మమ్మ

నంబులపూలకుంట, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూటివేలు గ్రామంలో తిమమ్మ మర్రిమాను మహాశివరాత్రి తిరునాళ్ల ఉత్సవాలు గురువారంతో ముగిసాయి. మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ తిరునాళ్లకు ఉమ్మడి అనంత జిల్లాతో పాటు అన్నమయ్య, కడప, చిత్తూరు, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు అధికంగా తరలివచ్చారు. బుధవారం రాత్రంతా ఆలయం వద్ద జాగరణచేసి గురువారం తెల్లవారుజామున అమ్మవారి దర్శనం చేసుకుని స్వగ్రామానికి తరలి వెళ్లారు.

ఘనంగా పరుషలు



అలంకరణలో వీరనారాయణస్వామి

బత్తలపల్లి, ఫిబ్రవరి 27(ఆంధ్ర జ్యోతి): మహాశివరాత్రి ముగిసిన మరుసటి రోజున పరుసలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా మండలంలోని రామాపురం, మాల్యవంతం, వెంకటగారి పల్లి గ్రామాల్లో వీరనారాయణస్వామి పరుషలను నిర్వహించారు. ఈ పరుషలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

నల్లలమ్మ గద్దె మీద పెద్దమ్మతల్లి



నల్లలమ్మ గద్దె మీద పూజలందుకుంటున్న పెద్దమ్మతల్లి

ముదిగుబ్బ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక పాతవూరులో వెలసిన గ్రామదేవత పెద్దమ్మతల్లి జాతర రెండో రోజైన గురువారం గుండోళ్ళ బావి వద్ద వెలసిన నల్లలమ్మ గద్దె మీద పెద్దమ్మతల్లి పల్లకి ఉంచి జాతరను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుండే కాకుండా కడప జిల్లా, తెలంగాణ, కర్ణాటక నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి జ్యోతులు, బోనాలు సమర్పించారు. పెద్దమ్మతల్లి పల్లకీని ఊరేగింపుగా తీసుకువచ్చి యథాస్థానంలో ఉంచారు. శుక్రవారం ఆలయంలో జాతర నిర్వహిస్తారు.

అంతర్‌జిల్లా దొంగకు మూడేళ్ల జైలు

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగ అమర్‌నాథ్ నాయుడుకు కదిరి కోర్టు మూడేళ్ల జైలు శిక్షను విధిస్తూ గురువారం తీర్పునిచ్చింది. క్రైం నంబర్ 152/2021లో అమర్‌నాథ్ నాయుడును అరెస్టు చేసిన నల్లమాడ సీఐ ఇస్మాయిల్, ముద్దాయిపై ఉన్న మొత్తం 14 దొంగతనం కేసులను ఛేదించారు. కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. క్రైం నంబరు, 152/2021తోపాటు క్రైం నంబరు 142/2020లో ముద్దాయికి ఒక్కో ఏడాది జైలు శిక్ష పడింది. గత ఏడాది నవంబరులో కొత్తచెరువు పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైం నంబర్ 85/2019లో మరో మూడేళ్ల సాధారణ జైలు శిక్ష పడింది. కేసులను ఏపీపీలు నగేష్, బాబు, రాజేంద్రప్రసాద్ వాదించారు. సీఐ ఇస్మాయిల్, కోర్టు కానిస్టేబుళ్లు కృష్ణమాచారి, చంద్రానాయక్‌ను ఉన్నాతాధికారులు అభినందించారు.



ఫ్రీ.. ఫ్రీ.. ఫ్రీ..!

రాయదుర్గం ప్యాలెస్ రోడ్‌లో ఓ కార్పొరేట్ కంపెనీ 'ఉచిత చికెన్ శిబిరం' నిర్వహించింది. చికెన్ వంటకాలు, ఉడికేసిన కోడిగుడ్లను పంపిణీ చేసింది. బర్డ్ ఫ్లూ కారణంగా చికెన్ కొనుగోళ్లు పడిపోవడంతో 'ఏమీ కాదు.. కావాలంటే తిని చూడండి' అన్నట్లు అవగాహన కల్పించింది. 'అవునా..? నిజమా..? ఏదీ చూద్దాం..' అని జనం ఎగబడటంతో తోపులాట జరిగింది. మహిళలు, చిన్నారులు సైతం క్యూలో నిలబడ్డారు. సరైన ఏర్పాట్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి.

-ఆంధ్రజ్యోతి, రాయదుర్గం

ప్రశాంతంగా కాటకోటేశ్వర స్వామి ఉత్సవాలు

రాత్రంతా చిల్లవారిపల్లిలో కలెక్టర్, ఎస్పీ జాగరణ... ఎట్టకేలకు సంప్రదాయం ప్రకారం ఉత్సవాల నిర్వహణ



ఊరేగింపుగా వస్తున్న స్వామి ఉత్సవ గుర్రాలు



చిల్లవారిపల్లిలో రాత్రి కలెక్టర్, ఎస్పీ పర్యవేక్షణ



పూజలో పాల్గొన్న పరిటాల శ్రీరామ్

తాడిమర్రి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కాటకోటేశ్వరస్వామి ఉత్సవాలు నేపథ్యంలో చిల్లవారిపల్లి గ్రామంలో శాంతిభద్రతలకు కొంత విఘాతం కలిగినా.. ఆ తర్వాత కలెక్టర్ టీఎస్‌చేతన్, ఎస్పీ వి.రత్న సూచనల మేరకు అధికారులు ఆ ఉత్సవాలు విజయవంతంగా ముగించారు. బుధవారం రాత్రి 12.30 గంటల సమయంలో రెండు ఉత్సవ గుర్రాలను కాటకోటేశ్వరస్వామి సన్నిధికి తీసుకువచ్చి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉదయం 11.30 గంటల సమయంలో గదే గుండం వద్ద నుంచి ఎలవగంపల్లో కొలువుదీరి ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. భారీ భక్త జనసందోహం నడుమ అగ్ని గుండప్రవేశం చేశారు. అనంతరం కాటకోటేశ్వరస్వామి ఎదుట ఉత్సవ గుర్రాలను కొలువు తీర్చారు. భక్తులు, గ్రామపెద్దలు, అధికారుల సందర్శన అనంతరం ఉత్సవ గుర్రాలను తిరిగి చిల్లవారిపల్లికి తరలించారు. కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న చిల్లవారిపల్లి సచివాలయంలో మకాం వేసి ఎప్పటికప్పుడు గ్రామంలో జరుగుతున్న విషయాలను ఆరాతీశారు. గ్రామస్థులకు సర్దిచెప్పి గుర్రాలను తీసుకువచ్చే విధంగా చేయడంలో సఫలీకృతులయ్యారు. అదేవిధంగా ఆ గుర్రాలను సాయంత్రం ఐదు గంటలకు చిల్లవారిపల్లికి తిరిగి చేర్చుతామంటూ ఉన్నతాధికారులు హామీ ఇవ్వడంతో గ్రామస్థులు సమ్మతించారు. దీంతో మహాశివరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమాల్లో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ నరసింహరాజు, డీఎస్పీ హేమంత్‌కుమార్, ఆర్డీఓ మహేశ్,సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

● స్వామిని దర్శించుకున్న పరిటాల శ్రీరామ్

కాటకోటేశ్వరస్వామిని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ గురువారం దర్శించుకున్నారు. ఉత్సవాలను ప్రశాంతంగా ముగిసేలా కృషి చేసిన డీఎస్పీ హేమంత్‌కుమార్, సిబ్బందిని అభినందించారు. చిల్లవారిపల్లి గ్రామస్థులతో చర్చలు జరిపారు. పూర్వం నుంచి వస్తున్న సాంప్రదాయం ప్రకారం మూడుకులాలలోని ఏడు గోత్రాల వారు ఉత్సవాలలో పూర్తిస్థాయిలో పాలుపంచుకోవాలన్నారు. ఎవరికి ఎక్కడా అన్యాయం జరగకుండా చూసుకునే బాధ్యత అధికారులు తీసుకుంటారన్నారు. రాబోవు కాలంలో ఇలా పోలీసు బందోబస్తు మధ్య గుర్రాల ఊరేగింపు జరగకుండా ఆనందోత్సవాల మధ్య జరిగేలా చర్యలు చేపడుదామన్నారు. ఈ చర్చల్లో మండల టీడీపీ కన్వీనర్ కూచిరాము, హర్ష, శేఖర్, సాయి, శ్రీనివాసరెడ్డి, రమణ పాల్గొన్నారు.

వీరనారాయణుడి పరుషకు పోటెత్తిన భక్తులు

అలరించిన ఎద్దుల బండ్ల ప్రదక్షిణ

ముదిగుబ్బ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంకేపల్లి సమీపంలో గురువారం వీరనారాయణస్వామి పరుష ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. గుడి చుట్టూ ఎద్దుల బండ్లు పోటాపోటీగా ప్రదక్షిణ చేశారు. భక్తులు ట్రాక్టర్లు, బొలేరోలు, ఇతర వాహనాలు కూడా స్వామి గుడి చుట్టూ తిప్పారు. రైతులు ఎద్దుల బండ్లను ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారికి ఎలువ గంపలు, పాల కావెడలతో మొక్కులు తీర్చుకున్నారు. మండలంలోని ప్రజలే కాకుండా ఇతర మండలాల నుంచి ఎద్దుల బండ్లను స్వామివారి ప్రదర్శనకు తీసుకొచ్చారు. గద్దె ప్రాంతంలో స్వామివారిని దర్శించుకొనేవారి కోసం బారికేట్లు ఏర్పాటు చేశారు.





గద్దె మీద పూజలందుకుంటున్న వీరనారాయణస్వామి, గుడి చుట్టూ ఎద్దుల బండ్ల ప్రదక్షిణ

భక్తులకు అన్నదానం నిర్వహించారు. గుడి చుట్టూ ఎద్దుల ప్రదక్షిణలో పరిటాల శ్రీరామ్, హరీష్‌బాబు, సందిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శోభాసువర్ణమ్మ

రేషన్ సక్రమంగా అందించాలి

తనకల్లు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): చౌకధాన్యపు డిపోలల్లో రేషన్‌ను సక్రమంగా అందించాలని తహసీల్దార్ శోభ సువర్ణమ్మ పేర్కొన్నారు. గురువారం స్థానిక స్టాక్‌పాయింట్‌లో నల్లచెరువు, తనకల్లు మండలాలకు సంబంధించిన చౌకధాన్య డిపో డీలర్లు, ఎండీఏ ఆపరేటర్లతో ఆమె సమావేశం నిర్వహించారు. స్టాక్ పాయింట్ నుంచి తూకాలు తక్కువగా వస్తున్నాయని పలువురు చౌకధాన్యపు డిపోడీలర్లు ఫిర్యాదు చేశారు. అంగనవాడీలు, పాఠశాలలకు సరఫరా చేసిన బియ్యానికి సంబంధించి కమీషన్లు జమకాలేదన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. డీలర్లు తప్పనిసరిగా స్టాక్‌పాయింట్‌కు వచ్చి తూకాలు వేసుకుని బియ్యం తీసుకెళ్లాలని సూచించారు. గ్రామాల్లో లబ్దిదారులు ఎవరికీ బియ్యం తక్కువ కాకుండా అందించాలన్నారు. తూకాల్లో వ్యత్యాసం ఉంటే సహించేదిలేదన్నారు. కొంత మంది డీలర్లు చిల్లర లేదని చెప్పి ఎక్కువ మొత్తాలలో డబ్బు తీసుకుంటున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. అలాంటి వారి విషయంలో ఉపేక్షించే ప్రసక్తేలేదన్నారు. డీలర్లవద్ద ఎప్పటికప్పుడు రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతినెలా సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ అనీల్‌కుమార్, స్టాకిస్ట్ వెంకటేశ్వర్లు, నల్లచెరువు ఆర్ఐ లక్ష్మీదేవి, తనకల్లు, నల్లచెరువు మండలాలకు చెందిన డీలర్లు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

అలరించిన నాట్య ప్రదర్శన

ధర్మవరం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రహ్మంగారి ఆలయంలో లలిత నాట్యకళానికేతన్ కళాకారులు నిర్వహించిన నాట్యప్రదర్శన ఆకట్టుకుంది.. ఆలయంలో బుధవారం రాత్రి స్వామి వారి కల్యాణోత్సవానికి ముందు లలిత నాట్యకళానికేతన్ గురువులు బాబూబాలాజీ, రామలాలిత్య ఆధ్వర్యంలో నిర్వహించిన నాట్యప్రదర్శన, ఓం శివోహం అనే నృత్య రూపకం ఆకట్టుకుంది. స్వయంభు కాలభైరవస్వామి ఆలయంలో మానస నృత్య కళా కేంద్రం వారిచే ప్రత్యేక నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. కళాకారిణి మానసను చేనేత ప్రముఖుడు, టీడీపీ నాయకులు సందారాఘవ, జింకా పురుషోత్తం, ఆలయ అర్చకులు ధనుంజయ ఆచారి సన్మానించారు.



నాట్యం చేస్తున్న కళాకారులు

రోగులకు పాలు, బ్రెడ్డు పంపిణీ

ధర్మవరం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వాస్పత్రిలో 110 మంది రోగులకు పాలు, బ్రెడ్డు, బిస్కెట్లను సత్యసాయి సేవాసమితి సుబ్బదాసు భజన మందిరం నిర్వాహకులు గురువారం పంపిణీచేశారు. భగవాన్ సత్యసాయిబాబా సందేశంతో కొన్నేళ్లుగా దాతల సహాయంతో సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు.

క్రైం న్యూస్..

గుండెపోటుతో రైతు మృతి



శ్రీనివాసులు (ఫైల్)

నల్లమాడ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాసంవారిపల్లికి చెందిన రైతు శ్రీనివాసులు(48) గుండెపోటుతో మరణించాడు. బుధవారం అర్ధరాత్రి తన పొలానికి నీరు పెట్టడానికి వెళ్లాడు. అక్కడ ఛాతినొప్పి రావడంతో కుప్పకూలి మరణించాడు. శివరాత్రి పండగ సందర్భంగా ఎక్కడో ఉంటాడులే అనుకుని బంధువులు భావించారు. ఉదయాన్నే అటుగా వెళ్లే రైతులు చూసి మృతుడి బంధువులకు సమాచారం అందించారు. వారువెళ్లి పరిశీలించగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. శ్రీనివాసులుకు భార్య ఆదిలక్ష్మి, కుమారుడు, మండల టీడీపీ నాయకులు ఆ గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు.

దుకాణదారుడిపై దాడి - ఆరుగురిపై కేసు

ముదిగుబ్బ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, ఆయన ప్రైవేట్ గన్‌మన్ ఉపేంద్ర, మరికొందరు తన భర్త మల్లిఖార్జునపై దాడి చేశారని సంకేపల్లి గ్రామానికి చెందిన లీలామృత గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ శివరాముడు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని సంకేపల్లి సమీపంలో నిర్వహిస్తున్న వీరనారాయణస్వామి పరుషలో మల్లిఖార్జున, లీలామృత టెంకాయల దుకాణం పెట్టారు. గురువారం ఎంపీపీ, తన అనుచరులతో వచ్చి.. దుకాణం పెట్టినందుకు డబ్బులు డిమాండ్ చేశారు. తాము వేలం పాటలో ఈ దుకాణం దుక్కించుకున్నామని, మళ్లీ డబ్బులు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించారు. దీంతో ఎంపీపీ, అతని అనుచరులు మల్లిఖార్జునపై దాడి చేశారు. లీలామృత ఫిర్యాదు మేరకు ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో 30 గొర్రెలు మృతి



గొర్రెల కళేబరాలు

బత్తలపల్లి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని జ్వాలాపురం సమీపంలో గురువారం గొర్రెల మంద పై ఐచర్ వాహనం దూసుకెళ్లింది. దీంతో 30 గొర్రెలు మరణించాయి. ధర్మవరం మండలం తిప్పేపల్లికి చెందిన నారాయణస్వామి గొర్రెలతో మండలంలోని జ్వాలాపురం సమీపంలో రోడ్డు దాటబోయాడు. కదిరి నుంచి బత్తలపల్లికి వెళ్తున్న ఐచర్ వాహనం ఆ గొర్రెల మందపై దూసుకెళ్లింది. దీంతో 30 గొర్రెలు మరణించాయి. వాహనాన్ని ఆపకుండా వెళ్లడంతో... బాధితులు, ఇతర వాహనదారులు ఆ ఐచర్‌ను వెంబడించారు. బత్తలపల్లి టోల్‌గేట్ వద్ద పట్టుకొని పోలీసులకు అప్పగించారు. తనకు రూ.మూడు లక్షలు నష్టము వాటిల్లినట్లు నారాయణస్వామి వాపోయడు. సీఐ ప్రభాకర్, పశువైద్యాధికారి గురునాథ్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మహిళ అదృశ్యం

కదిరి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక షమీరియా వీధికి చెందిన ఓ మహిళ రెండు రోజుల నుంచి కనిపించడం లేదని ఆమె భర్త గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈనెల 26న తన తమ్ముడు వచ్చాడని, ఆయనను రాయచోటీ బస్‌స్టాప్ వద్ద వదిలి వస్తానని చెప్పి వెళ్లిందని, ఆ తరువాత ఆమె ఇంటికి రాలేదని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

కదిరి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక పార్థసారధి కాలనీలో నివాసముంటున్న షేక్ రిజ్వాన్, ఆయన తండ్రి, తల్లిపై ఆయన భార్య షేక్ షహరూన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వరకట్న కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి గురువారం తెలిపారు. షేక్ షహరున్‌తో కర్ణాటక రాష్ట్రం చిక్‌బళ్లాపురానికి చెందిన షేక్ రిజ్వాన్‌తో నాలుగు సంవత్సరాల క్రితం పెళ్లి అయ్యింది. పెళ్లి సమయంలో ఎటువంటి కట్న, కానుకలు అడుగలేదు. ఆ తరువాత రూ. రెండు లక్షలు కట్నం తీసుకరావాలని భర్త రిజ్వాన్, ఆయన తండ్రి రఫిక్, జరీన్ తాజ్ వేధించినట్లు షహరూన్ తెలిపారు. ఈ వేధింపులు భరించలేక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

న్యూస్ బాక్స్

పౌరహక్కులపై అవగాహన



పౌరహక్కులపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్, ఎస్‌ఐ

పరిగి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలుచేసిన చట్టాలు, పౌరహక్కులపై గురువారం శాసనకోటలో తహసీల్దార్ హసీనాసుల్తానా ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా తహసీల్దార్, ఎస్‌ఐ రంగడు యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలు కల్పించిన హక్కులపై హక్కులు తెలుసుకునే విధంగా గ్రామాల్లో హక్కులపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. పౌరహక్కులకు భంగం కలిగేలా ప్రవర్తిస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌ను సంప్రదిస్తే వారికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. అనంతరం తహసీల్దార్ ఇంటర్మీడియట్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని కాలువపల్లి వద్ద ఉన్న విద్యానిధి జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ సిద్దేశ్, ఎస్సీ హాస్టల్ వార్డన్ వీరనారాయణ, వీఆర్‌ఓ మద్దిలేటి, సచివాలయ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

శివయ్యకు సామూహిక అభిషేకాలు



సామూహిక క్షీరాభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణ పరిధిలోని నానెప్పనగర్ శిరిడిసాయి ఆలయంలో శివలింగానికి, బాబా విగ్రహానికి పాలతో భక్తులు స్వయంగా అభిషేకాలు చేశారు. వేదపండితుల మంత్రోచ్చారణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఈ సందర్భంగా బాబా మూలవిరాట్‌ను సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. అదే విధంగా శ్రీకంఠేశ్వర స్వామి ఆలయంలో భక్తులు దీపాలు వెలిగించి మహాదేవుడిని స్తుతించారు. త్యాగరాజనగర్‌లోని ఉమా నర్మదేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూరప్పకట్ట వద్ద ఉన్న దక్షిణామూర్తి ఆలయంలో అభిషేకార్చనలు చేపట్టారు. భక్తులు జాగరణతో రాత్రంతా దేవాలయాలను సందర్శిస్తూ పరమశివుడిని స్తుతించారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించండి

పరిగి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) :మండలంలోని విద్యుత్ వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించాలంటూ ఏఈ సంజీవప్ప గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల ఫిబ్రవరి 28న చివరిరోజు కావడంతో ఇంటికి వచ్చిన బిల్లులను వెంటనే చెల్లించి రసీదు పొందాలన్నారు.

రేపట్నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు

అగళి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి 1 నుంచి 18వరకు నిర్వహించనున్నట్లు మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ జాఫర్ తెలిపారు. అగళి మోడల్ జూనియర్ కళాశాలలో ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. డిపార్ట్‌మెంటల్ అధికారిగా జూనియర్ లెక్చరర్ మంజునాథ్‌ను నియమించినట్లు తెలిపారు. మొత్తం విద్యార్థులు 297మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉందన్నారు. పరీక్షలు ఉదయం 9గంటలకు మొదలవుతాయని ఆ తరువాత పరీక్షా కేంద్రానికి వచ్చిన విద్యార్థులను అనుమతించేదిలేదన్నారు.

రేషన్ నొక్కుడుపై ఆర్డీఓ ఆగ్రహం

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే రేషన్ పంపిణీలో తూకాలు సక్రమంగా వేయాలని లేనిపక్షంలో చర్యలు ఉంటాయని ఆర్డీఓ ఆనంద్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆంధ్రజ్యోతిలో రేషన్ పంపిణీలో నొక్కుడు అనే కథనం ప్రచురితమైంది. రెవెన్యూశాఖలో ఈ కథనం కలకలంరేపింది. దీనిపై పెనుకొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద స్టోర్ డీలర్లతో స్టాక్‌పాయింట్ సిబ్బంది, సీఎస్‌డీటీ సమావేశాలు నిర్వహించినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఇక నుంచి పెనుకొండ స్టాక్‌పాయింట్‌కు ప్రతి డీలర్ వచ్చి వారికున్న కార్డులనుబట్టి రేషన్ బియ్యం తూకాలు చూసుకుని తీసుకెళ్లాలని సూచించారు. అయితే ఎక్కడ అక్రమాలు జరుగుతున్నాయనే దానిపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులు సీఎస్‌డీటీని కోరినట్లు తెలిసింది.

నాటుసారా తయారు చేసినా, అమ్మినా నేరమే



నాటుసారాపై అవగాహన కల్పిస్తున్న సీఐ

ఎనుకొండ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారుచేసినా, అమ్మినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ సృజన్‌బాబు హెచ్చరించారు. గురువారం నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా శెట్టిపల్లి గ్రామంలో నాటుసారా నిర్మూలనపై గ్రామస్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శెట్టిపల్లి తాండాను సారారహిత గ్రామంగా తయారు చేయడానికి గ్రామస్థులంతా సహకరించాలన్నారు. ఎక్కడైనా నాటుసారా తయారుచేసినా అధికారులకు తెలుపాలన్నారు.

షూటింగ్ బాల్ పోటీలకు గురుకుల విద్యార్థులు..



విద్యార్థులను అభినందిస్తున్న టీచర్లు

రొళ్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నల్గొండ జిల్లా తెలంగాణలో మార్చి 1 నుంచి జరుగుతున్న ఫోర్త్ సౌత్ జోన్ షూటింగ్ బాల్ ఛాంపియన్‌షిప్ 2025కి ఆంధ్రా తరఫున ఆడటానికి బి.ఆర్.అంబేడ్కర్ గురుకులంలో చదువుతున్న పృథ్వీ, తిలక్ ఎంపికయ్యారు. వీరు గురువారం రొళ్ల నుంచి క్రీడల్లో పాల్గొనేందుకు బయలుదేరి వెళ్లారు. వీరికి ఎస్‌ఎంసీ చైర్మన్ సుమ, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

అంతులేని అవినీతి



- కోడిగుడ్ల సరఫరాలో అక్రమాలు
- గర్భిణులకు అందించే గుడ్లలో చిలక్కొట్టుడు
- నిబంధనలకు విరుద్ధంగా ఒకేసారి సరఫరా
- కుళ్లిన గుడ్లు వస్తున్నాయంటున్న విద్యార్థులు

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు చిన్న వయసు నుంచే దృఢంగా ఉండాలన్న ఉద్దేశ్యంతో వారికి వారంలో ఐదు రోజులు నాణ్యమైన గుడ్లను సరఫరా చేస్తున్నారు. అలాగే గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆ సమయంలో బలంగా ఉండాలని అంగనవాడీ సెంటర్లకు గుడ్లను సరఫరా చేసే బాధ్యతను ప్రైవేట్ ఏజెన్సీకి ప్రభుత్వం అప్పగించారు. అయితే ఈ కోడిగుడ్ల సరఫరాలో అంతులేని అక్రమాలు జరుగుతున్నాయి. ఈ అక్రమాలపై ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, అంగనవాడీ సిబ్బంది ప్రశ్నిస్తే వారిపై రాజకీయ నాయకులు ఒత్తిడి తెచ్చి నోరు మూయిస్తున్నారు.



ఏజెన్సీ నిర్వాహకులతో వాగ్వాదానికి దిగిన ఉపాధ్యాయురాలు (ఫైల్)

ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత వైసీపీ పాలనలో ఉన్న ఏజెన్సీలను తొలగించి కొత్త ఏజెన్సీలను నియమించింది. నూతన ఏజెన్సీ నిర్వాహకులు ప్రభుత్వం ఆదేశించిన నిబంధనల మేరకు సరఫరా చేయడంలేదు. ఆయా పాఠశాలలకు విద్యార్థులనుబట్టి ఒక్కో విద్యార్థికి వారానికి ఐదు చొప్పున గుడ్లను అందించాలి. నెలకు అంగన్‌వాడీ సెంటర్లకు, ప్రభుత్వ పాఠశాలలకు నాలుగుసార్లు సరఫరా చేయాల్సి ఉండగా, నెలకు రెండుసార్లు లేదంటే మొత్తం ఒకేసారి అందిస్తున్నారు. వాహనాల ట్రాన్స్‌పోర్ట్‌కు ప్రభుత్వం నుంచి నాలుగుసార్లు నిధులు రాబట్టి తక్కువసార్లు గుడ్ల సరఫరా చేసి ఆ డబ్బులు మిగుల్చుకుంటున్నారు.

దీంతో నెలకు సంబంధించిన కోడిగుడ్లన్నింటిని గర్భిణీలు, బాలింతలు, విద్యార్థులకు ఒకేసారి అందించడంతో అవి కుళ్లిపోతున్నాయి. దీంతో వాటిని పారవేసే పరిస్థితి నెలకొంది. ఒకేసారి ఇవ్వడంతో విద్యార్థులకు సరిపడా కోడిగుడ్లు ఇవ్వకుండా తక్కువ ఇస్తున్నారన్న విమర్శలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. అలాగే నెలలో మొదటివారం నీలం రంగు, రెండో వారం గులాబిరంగు, మూడోవారం ఆకుపచ్చ, నాలుగోవారం వంగపువ్వు రంగు వేసిన కోడిగుడ్లను సరఫరా చేయాలి. పెనుకొండ నియోజకవర్గంలో అలాంటి నిబంధనలు ఎక్కడా పాటించడంలేదు.

చోద్యం చూస్తున్న విద్యాశాఖ, ఐసీడీఎస్ అధికారులు

పెనుకొండ మండలంలో 48ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో హైస్కూల్ 8, ప్రాథమిక పాఠశాలలు6, ప్రాథమికోన్నత పాఠశాలలు 34 ఉన్నాయి. ఇందులో 4,113మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. బాలురు 2024మంది, బాలికలు 2089మంది ఉన్నారు. ప్రతి విద్యార్థికి వారంలో ఐదు గుడ్లు చొప్పున నాలుగు వారాలు సక్రమంగా సరఫరా చేస్తే పెనుకొండ మండలంలోనే 1,02,825 కోడిగుడ్లు అందించాల్సి ఉంది. సోమందేపల్లి, పరిగి, గోరంట్ల మండలాల్లో 291అంగన్‌వాడీ సెంటర్లకుగాను 2.50లక్షల కోడిగుడ్లు అందించాలి. పెనుకొండ పరిధిలోని పెనుకొండ, రొద్దం మండలాల్లో 168అంగన్‌వాడీ సెంటర్లకు గాను బాలింతలు, గర్భిణీలు, చిన్నారులకు 1.50లక్షల కోడిగుడ్లు ప్రతినెలా అందించాలి. విద్యార్థులకు సంబంధించి కోడిగుడ్ల సరఫరాలో అవినీతి అక్రమాలు డివిజన్ కేంద్రమైన పెనుకొండలో ఎక్కువగా జరుగుతున్నాయి. పాఠశాల విద్యార్థులను, ఉపాధ్యాయులను, మధ్యాహ్న భోజన నిర్వాహకులను విడివిడిగా విచారిస్తే ఈ అంతులేని అవినీతి అక్రమాలు బయటపడతాయి. ఈ నాశిరకం కోడిగుడ్లపై పెనుకొండ ఆర్డీఓ దృష్టిసారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కోడిగుడ్ల సరఫరాలో నిబంధనలకు విరుద్దంగా ఇంత తంతు జరుగుతున్నా పట్టించుకున్న పాపానపోలేదు. ప్రతి మండలంలో ఎంఈఓ-1, 2 అధికారులు, అంగన్‌వాడీ సీడీపీఓలు ఉంటారు. వీరు కార్యాలయాలకే పరిమితమయ్యారని విమర్శలున్నాయి. కుళ్లిన గుడ్లు సరఫరాచేస్తున్నారని ఫిర్యాదులువస్తున్నా చోద్యంచూస్తూ మిన్నకుండి పోతున్నారు.

ఇప్పటికైనా గుడ్లను ప్రతినెలా నాలుగుసార్లు సరఫరా చేసేలా ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని, అలాగే ప్రతి వారం అందుకు సంబంధించిన రంగులతో కూడిన గుడ్లను సరఫరాల అయ్యేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఏజెన్సీని బ్లాక్‌లిస్ట్‌లో పెడతాం

ప్రతినెలా 4వారాలు క్రమం తప్పకుండా కోడిగుడ్లు అందించాలి. ఈ ఏజెన్సీపై పలుఫిర్యాదులు అందాయి. ఇప్పటికే ఆ ఏజెన్సీకి మెమో ఇచ్చాం. కుళ్లినగుడ్లు వస్తే విద్యార్థులకు పెట్టకండని ఉపాధ్యాయులకు సూచించాం. ప్రతి వారానికి సంబంధించి రంగు వేయాల్సిందే. ఇప్పటికే సరఫరా సక్రమంగా జరగలేదని ఎస్పీడీకి ఫిర్యాదు చేశాం. ఏజెన్సీని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని లేదంటే వేరే ఏజెన్సీని మార్చాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం. -**రామక్రిష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్, మధ్యాహ్న భోజనం**

మహా కాళేశ్వరుడి అలంకరణలో భోగ రామలింగేశ్వరస్వామి



మహాకాళుడిగా దర్శనమిస్తున్న శివుడు

మడకశిరటౌన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మడకశిర పట్టణంలో మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని రెండో రోజు చంద్రమౌళేశ్వరస్వామి, భోగి రామలింగేశ్వరస్వామి, షిరిడీసాయినాథుడి ఆలయం, అయ్యప్పస్వామి తదితర దేవాలయాల్లో విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. భోగి రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ఉజ్జయినీ మహా కాళేశ్వరుడి అలంకరణ చేశారు. అదేవిధంగా పట్టణంలో అనేక మంది భక్తులు జాగరణ చేశారు.

గుడిబండ: మండలంలోని గ్రామాల్లో బుధవారం రాత్రి, గురువారం శివరాత్రి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు.ఎస్.రాయాపురం గ్రామంలో యువకులు శివరాత్రి పండుగ పురస్కరించుకొని వాలీబాల్ క్రీడా పోటీలను నిర్వహించారు.

పోసాని కృష్ణమురళి అరెస్టు అక్రమం

మడకశిరటౌన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అక్రమ అరెస్టులను ఆపాలని, పోసాని కృష్ణమురళి అరెస్టు అక్రమం అని వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనంద రంగారెడ్డి అన్నారు. గురువారం స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. న్యాయస్థానం అనేక సార్లు బీఎన్‌ఎస్-111 సెక్షన్లు వర్తించవని పేర్కొన్నా ఆ సెక్షన్ల కింద అక్రమ కేసులు నమోదు చేసి అరెస్టు చేయడం ఎంతవరకు న్యాయం అన్నారు. ఇప్పటికైనా అక్రమ అరెస్టులను ఆపాలని డిమాండ్ చేశారు.

అలంకారప్రాయంగా రైతుసేవా కియోస్క్‌లు

- నెట్ సౌకర్యంలేక మూలనపడ్డ వైనం
- లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా



పనిచేయని కియోస్క్ యంత్రం

మడకశిర రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల్లో కియోస్క్‌లు అలంకార ప్రాయంగా మారాయి. గత వైసీపీ ప్రభుత్వం రైతులకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్ధేశ్యంతో లక్షాలాది రూపాయిల వ్యయంతో ఎంతో ఆర్భాటంగా రైతు సేవాకేంద్రాల్లో ఈ యంత్రాలను ప్రారంభించింది. రైతులకు కావలసిన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, డ్రిప్, పశుగ్రాసం వంటివి ఈ కియోస్క్‌ద్వారా నమోదు చేసుకోంటే 48 గంటల్లోనే రైతులకు అందిస్తామని ప్రకటించారు. అయితే ఆ హామీ ఆచరణకు మాత్రం నోచుకోలేదు. ఆ కేంద్రాలకు నెట్ సౌకర్యాలు కల్పించకపోవడంతో ఆ యంత్రాలను సేవలు అందించకుండా మూలన పెట్టేశారు. దీంతో లక్షాలాది రూపాయిల ప్రజాధనం వృథా అయింది.

మడకశిర నియోజకవర్గంలో ఐదు మండలాల్లో 74 రైతు సేవాకేంద్రాలు ఉన్నాయి. అప్పట్లో ఒక్కొక్క కియోస్క్‌ను రూ.80 వేలతో కొనుగోలు చేశారు. మడకశిర మండలంలో 18 రైతుసేవా కేంద్రాలు, రొళ్ళలో11, అగళిలో15 అమరాపురంలో 15, గుడిబండలో 15 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. వాటిలో వేటికీ ఇంత వరకూ ఇంటర్ నెట్ సౌకర్యం కల్పించలేదు. విధిలేని పరిస్థితుల్లో మొదట్లో ఆ కేంద్రం ఇన్‌చార్జిలు సొంతఖర్చులతో ఇంటర్ నెట్ కల్పించి వినియోగించారు. తరవాత మానివేశారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోని రైతుసేవా కేంద్రాలకు నెట్ సౌకర్యం కల్పించి కియోస్క్‌లు పనిచేసేవిధంగా చూడాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై వ్యవసాయ అధికారి తిమ్మప్పను విచారించగా రైతు సేవాకేంద్రాల్లో ఉన్న కియోస్క్‌లు పనిచేసేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుడా డిపార్ట్‌మెంట్ యాప్ ద్వారా సేవలు అందిస్తున్నామన్నారు.

ఘనంగా రంగనాథస్వామి జలధి



జలధి ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

రొళ్ల, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రొళ్ల కొండ గ్రామంలో వెలిసిన శ్రీరంగనాథస్వామి జలధి ఉత్సవాన్ని గురువారం గ్రామస్థులు, కులపెద్దల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. రంగనాథ స్వామిని వివిధ పూలతో అలంకరించి, డప్పువాయిద్యాలతో ఉరుములతో ఊరేగించారు. వందలాది మంది భక్తులు జలధి ఉత్సవంలో పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు తీసుకొన్నారు.

విగ్రహరూపంలో దర్శనమిచ్చిన సిద్దేశ్వరస్వామి



ప్రత్యేక అలంకరణలో సిద్దేశ్వరస్వామి

అమరాపురం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలిసిన శ్రీసిద్దేశ్వరస్వామి మానవ విగ్రహరూపంలో దర్శనమిచ్చారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం ఉదయమే వివిధ అభిషేకాలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్, కార్యనిర్వాహణ అధికారి నరసింహ రాజు తెలిపారు. సిద్దేశ్వరస్వామి దేవతా మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి మేళ తాళాల మధ్య గ్రామ వీధుల్లో ఊరేగించారు. ముత్యాలపల్లకి ఉత్సవం అనంతరం అన్నసంతర్పణ నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాన్ని వినియోగించారు.

అగళి: శివరాత్రి పండుగ ముగింపు సందర్భంగా గురువారం అగళి శంకర ఈశ్వర స్వామి దేవాలయంలో అగళి టీడీపీ జెడ్పీటీసీ ఉమేష్, కార్యకర్తలు పూజా కార్యక్రమాలు చేపట్టారు.

పావగడ : శివరాత్రి వేడుకలను పురస్కరించుకుని తాలూకా వ్యాప్తంగా పలు ఆలయాల్లో ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. కామినికొండ, రామతీర్థం నిడిగల్, దుర్గం, కేతగానికెరె, అనుమనబెట్ట, తదితర ప్రాంతాలలో శివలింగాలకు భక్తులు ఎంతో భక్తిశ్రద్దలతో పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

లేపాక్షిలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

హిందూపురం, లేపాక్షి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జాగరణ సందర్భంగా బుధవారం రాత్రి లేపాక్షిలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. హైదరాబాద్ నుంచి వచ్చిన జబర్దస్త్ టీం తెల్లవారుజామున 4గంటల వరకు భక్తిపాటలతో అలరించారు. మిమిక్రి చేసి అందరినీ మంత్రముగ్దులను చేశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న వారికి లేపాక్షి ఆలయ చైర్మన్ రమానందన్, ఆధ్వర్యంలో సీఐలు జనార్దన్, అంజనేయులు బహుమతులు అందజేశారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఈ ఏడాది జాగరణ సందర్భంగా ఆలయ చైర్మన్ సొంతఖర్చులతో మూలవిరాట్‌కు, రథోత్సవానికి బెంగళూరు నుంచి పూలు తెప్పించి అలంకరించారు.



సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న ఎంపీ అంబికా



కార్యక్రమాల్లో పాల్గొన్నవారిని అభినందిస్తున్న లేపాక్షి ఆలయ చైర్మన్

మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా బుధవారం రాత్రి లేపాక్షిలో జాగరణ కార్యక్రమాన్ని భక్తులు ఎంతో భక్తిశ్రద్దలతో నిర్వహించారు. బుల్లితెర నటుల వినోద కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ దంపతులు, హిందూపురం మునిసిపల్ చైర్మన్ డీఈ రమేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వినాయక మండపాల నిర్వాహకులకు బహుమతులు

హిందూపురం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): గతేడాది జరిగిన వినాయక నిమజ్జనం సందర్భంగా పోలీసు నిబంధనల ప్రకారం విగ్రహాలు నిమజ్జనం చేసిన కమిటీ నిర్వాహకులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. లేపాక్షిలో బుధవారం రాత్రి జరిగిన కార్యక్రమ వేదికపై ఐదు విగ్రహాల కమిటీ నిర్వాహకులకు ఈ బహుమతులు అందజేశారు. గత యేడాది సెప్టెంబరు 13న హిందూపురంలో పోలీసులు చెప్పిన విధంగా విగ్రహాలను తీసుకెళ్లి గుడ్డం కోనేరులో నిమజ్జనం చేసిన కమిటీలకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. మొదటి బహుమతి కింద డీబీ కాలనీలోని వల్లభ వినాయక సేవా సమితికి రూ.15వేలు, రెండో బహుమతిగా కోటా ఏరియాలో ఉన్న విశ్వ వినాయక సేవా సమితికి రూ.12వేలు, మూడో బహుమతిగా డీఆర్ కాలనీలోని రాష్ట్రీయ వినాయక సేవా సమితికి రూ.10వేలు, నాలుగో బహుమతి కింద ఆర్టీసీ కాలనీకి చెందిన గరుడ వినాయక సేవా సమితికి రూ.8వేలు, ఐదో బహుమతికింద హస్నాబాద్‌కు చెందిన శ్రీసిద్దివినాయక సేవా సమితికి రూ.5వేలు డీఎస్పీ మహేష్, లేపాక్షి ఆలయ చైర్మన్ రమానంద అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా పోలీసులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటివారిని గుర్తించి బహుమతులు అందజేస్తామన్నారు.



బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ, ఆలయ చైర్మన్ రమానందన్

కిటకిటలాడిన బెంగళూరు-ధర్మవరం మెమూ రైలు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి ధర్మవరం వరకు నడిచే మెమూ రైలు బుధ, గురువారాల్లో కిక్కిరిసిపోయింది. మహా శివరాత్రి పర్వదినం కావడంతో బెంగళూరులో వివిధ పనుల నిమిత్తం ఉంటున్న ఆంధ్రులు సొంత ఊర్లకు తరలివచ్చారు. బెంగళూరు పుట్టపర్తి ప్రశాంత నిలయం, బెంగళూరు, ధర్మవరం వరకు నడిచే రెండు రైళ్లు ఉదయం బెంగళూరులో బయలుదేరి ఒంటి గంటకల్లా ధర్మవరం చేరుకుంటాయి. అయితే అనివార్య కారణాల వల్ల పుట్టపర్తి రైలును రద్దు చేశారు. అదే విధంగా ధర్మవరం వరకు నడిచే మెమూ రైలును కూడా హిందూపురం వరకే నడిపి అక్కడే నిలిపివేశారు. ఈ విషయం ముందుగా తెలియని ప్రయాణికులు బెంగళూరులో రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. మరలా బస్టాండ్‌కు వెళ్ళాలంటే ప్రయాసతో కూడిన పని కావడంతో హిందూపురం వరకు వచ్చి అక్కడ నుంచి ఇతర మార్గాల ద్వారా సొంతూర్లకు తరలి వెళ్ళారు. అందులోనూ రైలు టికెట్ ధర తక్కువ ఉండటంతో వేలాది మంది ప్రయాణికులతో రైలు కిక్కిరిసిపోయింది. చాలా మంది ప్రయాణికులు నిలబడి ప్రయాణించారు. ఇదే అదనుగా ఆటోవారు ధరలను పెంచి అందినకాడికి వసూలు చేశారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పెనుకొండ రూరల్ ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : రొద్దం మండలం పాతర్లపల్లికి గ్రామానికి చెందిన శివకుమార్ అదృశ్యమైనట్లు తండ్రి సుబ్బరాయుడు రొద్దం పోలీసు స్టేషన్‌లో గురువారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. పాతర్లపల్లికి చెందిన శివకుమార్ బీఈడీ వరకూ చదువుకున్నాడు. 2020 సంవత్సరంలో పెనుకొండ మండలం మాటూరు గ్రామానికి చెందిన క్రిష్టప్ప కుమార్తె భార్గవిలతతో వివాహమైంది. వివాహమైనప్పటికీ ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తూ వస్తున్నాడు. ఈనెల 23వతేదీ జరిగిన గ్రూ-2 పరీక్ష కోసం అవనిగడ్డ డీఎస్సీ కోచింగ్ సెంటర్‌లో ప్రిపేర్ అయ్యాడు. గ్రూప్-2 పరీక్ష రాసేందుకు ఈనెల 22న అవనిగడ్డ నుంచి స్వగ్రామానికి వచ్చాడు. ఆ మరుసటి రోజు అనంతపురం జిల్లా కేంద్రంలో పరీక్ష రాసేందుకు వెళ్లాడు. పరీక్ష రాసేందుకు వెళ్లిన శివకుమార్ తిరిగి ఇంటికి చేరలేదు. ఆయన తండ్రి సుబ్బరాయుడు తన కుమారుడికి ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చింది. అప్పటి నుంచి అనంతపురం, హిందూపురం ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో గురువారం రొద్దం పోలీసుస్టేషన్‌లో తన కుమారుడు కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రెండు కార్లు ఢీ

గుడిబండ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంబులబండ గ్రామ సమీపంలో రెండు కార్లు ఢీకొన్నాయి. అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు ప్రాణాపాయం నుండి బయటపడినట్లు ఎస్‌ఐ రాజకుళ్లాయప్ప తెలిపారు. అమరాపురం మండలంలో వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అమరాపురం నుంచి హిందూపురంకు కారులో ప్రయాణిస్తున్న సమయంలో కేకాతి క్రాస్ మలుపు వద్ద ఎదురుగా వస్తున్న కారు పరస్పరం ఢీకొన్నాయి. రెండు కార్లలో ప్రయాణిస్తున్నవారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. రెండు కార్లు దెబ్బతిన్నాయి. జరిగిన సంఘటనపై విచారించి కేసు నమోదు చేయనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.